# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నీతి ఆయోగ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు.
- విదేశీ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- క్రీడా ప్రతిభా పురస్కారాలకు రాష్ట్రంలోని 130 పాఠశాలలను ఎంపిక చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విజయ రామరాజు తెలిపారు.
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ ఈరోజు విశాఖలో పర్యటించారు.
- రానున్న రెండు రోజుల్లో ఉత్తర బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

====================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు నీతి ఆయోగ్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. “వికసిత్ ఆంధ్రప్రదేశ్ - 2047 విజన్ డాక్యుమెంట్” రూపకల్పనపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేస్తున్నామని వారికి తెలిపారు. అలాగే... వచ్చే 5 సంవత్సరాలకు జిల్లాల వారీగా విజన్ డాక్యుమెంట్లు రూపొందిస్తున్నామన్నారు. మాక్రో టూ మైక్రో విధానం అవలంబించేలా చర్యలు తీసుకుంటున్నామన్న ముఖ్యమంత్రి... రాష్ట్రాన్ని ఆహార శుద్ధి కేంద్రంగా తయారు చేస్తామన్నారు. పారిశ్రామికంగా యువతలో నైపుణ్యం పెంచేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్‌ను దేశ తూర్పు తీరానికి లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వివరించారు. రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని, అందరికీ అత్యాధునిక వైద్యసేవలు అందేలా చర్యలు చేపడుతున్నామని నీతి ఆయోగ్ ప్రతినిధులకు వివరించారు.

====================

విదేశీ పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారని కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈరోజు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ సభల ద్వారా అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని, భూ ఆక్రమణలకు పాల్పడ్డారని అన్నారు.  ఈ నేపథ్యంలో సెప్టెంబరు 1వ తేదీ నుంచి రాష్ట్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మరికొన్ని విమానాశ్రయల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 36 సెకన్లు)

====================

క్రీడలో అత్యంత ప్రతిభ కనబరిచిన 130 పాఠశాలలను క్రీడా ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విజయ రామరాజు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తూ...  ఈ నెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని  పురస్కరించుకొని పురస్కారాలను అందజేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడల ప్రాధాన్యతనను ఆ విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో 1,040 పాయింట్లతో కడప మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ తొలిస్థానం, ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ 1,008 పాయింట్లతో రెండవ స్థానం, చిలకలూరిపేట ఏ ఎం జి హై స్కూల్ 963 పాయింట్లతో మూడవ స్థానం సాధించినట్టు ఆయన తెలియజేశారు.

====================

పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ ఈరోజు విశాఖలో పర్యటించి, నగర పాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను సమీక్షించారు. ఇందులో భాగంగా కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ లోని  వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను, బయోమైనింగ్ ప్లాంటు ను భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావుతో కలిసి సందర్శించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను ఆధునికరించి చర్యలు చేపట్టేలా జిందాల్ ప్రతినిధులకు ఆదేశించాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ కు సూచించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... గతంలో జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించి వ్యర్థాల సేకరణ, వాటి వినియోగం పునరుత్పత్తి మొదలైనవి అధ్యయనం చేశామన్నారు. అక్కడ ఉన్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లు దుర్వాసన వెదజల్లవని, అదేవిధంగా విశాఖ ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా ఈ ప్లాంటును ఆధునికరించాలని అధికారులకు ఆదేశించామని తెలియజేశారు.

====================

సాంకేతిక పరమైన నిర్వాహణ కోసం ఈ నెల 30వ తేదీన రాష్ట్రంలోని కొన్ని కేంద్రాల్లో పాస్‌పోర్టు సేవలు నిలిపి వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. విజయవాడ, తిరుపతిలోని కేంద్రాలతో పాటు అనంతపురం, బాపట్ల, చిత్తూరు, గుడివాడ, గుంటూరు, హిందూపూర్, కడప, నంద్యాల, నరసరావుపేట, నెల్లూరు, ఒంగోలు, రైల్వే కోడూరు, YSR కడప కేంద్రాల్లో సేవలను ఆ రోజు రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 30వ తేదీ కోసం ముందుగా అపాయింట్‌మెంట్లు తీసుకున్న వారికి సెప్టెంబరు 6వ తేదీన సేవలు అందించడం జరుగుతుందన్నారు. రీ షెడ్యూల్ తేదీ, ఇతర సమాచారం సందేశాల రూపంలో తెలియజేయబడుతుందని అధికారులు వివరించారు.

విరామం

====================

జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పుట్టిన రోజును పురస్కరించుకొని, సెప్టెంబరు 2వ తేదీన పార్టీ శ్రేణులు ప్రజా ఉపయోగ కార్యక్రమాల్లో పాల్గొనాలని జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. 'క్లీన్ ఆంధ్ర – గ్రీన్ ఆంధ్ర' ఇతివృత్తంతో రాష్ట్రవ్యాప్తంగా జరిగే కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈరోజు ఆయన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబుతో కలిసి, దృశ్యశ్రవణ మాధ్యమం ద్వారా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మాట్లాడారు. పవన్ కళ్యాణ్ సమాజాన్ని, ప్రకృతిని ప్రేమించే వ్యక్తి అని, ఆయన జన్మదినం సందర్భంగా సమాజ హితమైన, పర్యావరణ హితమైన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలను, శుభ్రం చేయడం, చెట్లు నాటడం వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన పార్టీ శ్రేణులకు, పవన్ కళ్యాణ్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

=====================

రానున్న రెండు రోజుల్లో ఉత్తర బంగాళా ఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇది ఆ తరువాత రెండు రోజుల్లో పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ.. దక్షిణ ఒరిస్సా, ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరానికి దగ్గరగా వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న రెడు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందన్నారు. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉన్నట్టు తెలిపారు.

=====================

చేపల చెరువులకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖాధికారి పి.తిరుపతయ్య తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... చేపల చెరువుల కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ- 2020 ప్రకారం లైసెన్స్ ల మంజూరు జరుగుతుందని, గ్రామ మత్స్యశాఖ అసిస్టెంట్ ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున చెల్లించాలన్నారు. అర్హత కలిగిన దరఖాస్తులకు జిల్లా, మండల స్థాయి కమిటీల ద్వారా లైసెన్స్ ల మంజూరు జరుగుతుందని ఆయన వివరించారు.

=====================

సీజనల్ వ్యాధులను అరికట్టి, ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. ఈరోజు జరిగిన జిల్లా పరిషత్ స్థాయి సంఘం సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తక్షణమే అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు రెండు జిల్లాల్లో విపరీతంగా ఉన్నాయని, ప్రతీ ఇంటిలో జ్వర పీడితులు ఉన్నారని, ఇటీవల జిల్లాలో స్వైన్‌ఫ్లూ కేసు కూడా నమోదైందని అన్నారు.

=====================

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా గ్రామస్థాయిలో సూక్ష్మ ప్రణాళికలు రూపొందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎం.పి.డి.ఓ)లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఎంపిడివోలతో ఈరోజు జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకమన్నారు. ఉపాధి హామీ పథకం క్రింద వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసి... అభివృద్ధి పనులు చేపట్టడానికి సరైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. మండలాల్లో సమగ్రమైన డేటా తయారు చేయాలని, ఆరోగ్యం మెరుగు పరచడం, పౌష్టిక ఆహారాన్ని అందివ్వడం, సురక్షిత తాగు నీరు అందించడం మొదలైన అంశాలు కూడా అభివృద్ధిలో భాగమని ఆయన పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది సేవలు సంతృప్తికర స్థాయిలో ఉపయోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

=====================

ఇటీవల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో జరిగిన గ్రామసభలో ముఖ్యమంత్రికి అందిన ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ టి. నిషాంతి అధికారులను ఆదేశించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... వాడపట్టి గ్రామంలో జరిగిన గ్రామసభలో 391 ఫిర్యాదులు అందాయని, గడువు లోపుగా వీటిని పరిష్కరించాలని చెప్పారు. ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని... ఫిర్యాదులో ఆర్థికపరమైన అంశాలు ఉన్నప్పుడు సంబంధిత శాఖల కార్యదర్శులకు సమస్యను వివరిస్తూ... లేఖలను కలెక్టర్ ద్వారా పంపే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. 391 ఫిర్యాదుల్లో ఇప్పటివరకు 49 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందని జాయింట్ కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు.

=====================

వ్యాపారస్తులు వస్తు, సేవా పన్నులను తప్పనిసరిగా చెల్లించాలని కస్టమ్స్ అండ్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సెస్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ అన్నారు. తిరుపతిలోని జీఎస్టీ కార్యాలయంలో నూతన కమిషనర్ ఛాంబర్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు.

=====================

=====================